




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 17 జూన్ 2025 పేజీలు 8



జిల్లాలో జర్నలిస్ట్ పిల్లలకు

## 50%

ఫీజు రాయితీ

ఉత్తర్వులను జారీ చేసిన విద్యాశాఖ

మంత్రి కొల్లుకు మచిలీపట్నం మీడియా మిత్రుల కృతజ్ఞతలు

మచిలీపట్నం మేజర్ న్యూస్ : కృష్ణాజిల్లాలో పని చేస్తున్న జర్నలిస్ట్ పిల్లల ప్రైవేట్ స్కూల్స్ లో 50% ఫీజు రాయితీ కల్పిస్తూ 2

### మాదక ద్రవ్యాల మహమ్మారిపై

# మూకుమ్మడి దాడి!

- అన్ని విద్యాసంస్థల్లోనూ ఈగల్ క్లబ్స్ ఉండాల్సిందే
- క్యాంపస్ అంబాసిడర్లనూ నియమించాలి
- పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి చేయిచేయి కలుపుదాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 16, మేజర్ న్యూస్ : సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారం దిశగా అడుగులేస్తూ మూకుమ్మడి దాడితో మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేయిచేయి 2లో



## కళాత్మక యోగాతో ప్రజలలో మరింత చైతన్యం

- 2 కోట్ల 20 లక్షల మంది యోగాసనాలను ఆచరించాలనే లక్ష్యం..
- యోగాసనాలపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం..
- సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. ఎ.సిరి

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 16, మేజర్ న్యూస్ : కళాత్మకమైన యోగాసనాలతో ప్రజలకు మరింత చైతన్యం చేసేందుకు యోగాసనాలపై విభిన్న పోటీలను నిర్వహించి నైపుణ్యవంతులైన కళాకారులతో యోగాసనాలకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్నామని రాష్ట్రంలో 2 కోట్ల 20 లక్షల మంది యోగాసనాలను ఆచరించాలనే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. ఎ.సిరి తెలిపారు. అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని మిగతా 2లో...



## ఫీజు బకాయిలు చెల్లిస్తాం : ప్రభుత్వం

### చెల్లిస్తేనే సర్టిఫికెట్లు యిస్తాం : కళాశాలలు

- విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు, కళాశాలల చెలగాటం
- ప్రభుత్వాలు ఫీజు బకాయిలు చెల్లించక విద్యార్థుల అవస్థలు
- మొత్తం ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల మెలిక
- కళాశాలల తీరుతో అడ్మిషన్లు, ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం
- ఫీజులు చెల్లించండి లేక సర్టిఫికెట్లు యిప్పించండనే డిమాండ్

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వంలో మూడు విడతల బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఎన్నికల ముందు ఏడాది మూడు నెలల ఫీజును మాత్రమే నాటి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమ చేసింది. మరో మూడు విడతలు బకాయి పెట్టింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలోనూ ఏడాది విద్యా సంవత్సరం పూర్తయ్యింది. ఒక్క విడతకు మాత్రం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశారు. ఏదిఏమైనా గత ప్రభుత్వంలో మూడు విడతలు, ప్రస్తుత ప్రభుత్వంలో మూడు విడతల ఫీజు బకాయిలు పెండింగులో ఉండిపోయాయి. దీంతో పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకు పోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఫీజు బకాయిల విషయంపై ఆరా తీసిన ప్రభుత్వం సచివాలయాలకు మార్గదర్శకాలు విడుదల చేసి ఎవరి ఖాతాలో జమ చేయాలో వివరాలు సేకరించింది. అలాగే సర్టిఫికెట్‌ల విషయంలో విద్యార్థులకు అవరోధాలు కల్పించ వద్దంటూ కూడా కూటమి ప్రభుత్వం కళాశాలలకు ఆదేశాలు జారీచేసింది. కానీ సర్టిఫికెట్లు అడిగితే పాలిటెక్నిక్, మిగతా 2లో...

## స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్వచ్ఛ ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్ లు, సమస్యలు, తదితర ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి అంశాలు ఏమైనా ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్ లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు చేర్పులు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం జూన్ 14 నాటికి మార్పులు, చేర్పులు చేపట్టిన మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## జిల్లాలో జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ

ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర సూచనలు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు 50% ఫీజు రాయితీ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సోమవారం విడుదల చేశారు. గత మూడు రోజుల క్రితం మచిలీపట్నం మీడియా మిత్రులు ఆధ్వర్యంలో పలువురు వర్కింగ్ జర్నలిస్టులు మంత్రి కొల్లు రవీంద్రను కలిసి 50% ఫీజు రాయితీ ఉత్తర్వులు జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం మీడియా మిత్రులు అందజేసిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు బదిలీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 50% ఫీజు రాయితీ ఉత్తర్వులను విద్యాశాఖ జారీ చేసింది. ఫీజు రాయితీ ఉత్తర్వులు జారీకి సహకరించిన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీకి మచిలీపట్నం మీడియా మిత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫీజు బకాయిలు చెల్లిస్తాం : ప్రభుత్వం

**చెల్లిస్తేనే సర్టిఫికెట్లు యిస్తాం : కళాశాలలు**

ఇంజనీరింగ్ కాలేజీలు విద్యార్థుల విషయంలో దారుణంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజులు ఎప్పుడు విడుదల చేస్తుందనేది మాకు సంబంధం లేదు. ముందు మా ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోండి. మీకు అడ్మిషన్లు ఉంటే మాకేంటి? ఇంటర్వ్యూలు ఉంటే మాకేంటి?' అని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో మూడేళ్ళ డిప్లొమా, నాలుగేళ్ల బీటెక్ కోర్సు చదివిన విద్యార్థులకు చివరి సంవత్సరంలో ఇబ్బందులు ప్రారంభమైనాయి. చివర్లో మొత్తం ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు యిస్తామని కాలేజీలు మెలిక పెట్టి, మొత్తం ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి. సర్టిఫికెట్లు కీలకం కావడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫీజు బకాయిలు చెల్లించడానికి స్తోమత లేనివారు వారి పిల్లలను ఈప్ సెట్, ఈసెట్ కౌన్సిలింగులకు, ఇంటర్వ్యూలకు కూడా పంపలేకపోతున్నారు. ఇప్పుడు వేలాదిమంది విద్యార్థులు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వం చెల్లిస్తానన్న ఫీజులు చెల్లించక, కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ వెంటనే స్పందించి ఫీజు బకాయిలు చెల్లించాలి. అలాకానిపక్షంలో ఫీజు బకాయిల చెల్లింపుపై కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు యిచ్చి విద్యార్థులకు సర్టిఫికెట్లు యిప్పించాలనే డిమాండును విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం ముందు పెడుతున్నారు.

# స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి చర్యలు



అనంతరం జిల్లాలో 7,46,647 మంది పురుష ఓటర్లు, 7,94,586 మంది స్త్రీలు, 50 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 15,41,283 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ బూత్ వివరాలు తెలిపే చిరునామాలో కులాల పేర్లతో కూడిన పదాలను వాడకుండా చూడాలని, అదేవిధంగా ఎన్నికలకు సంబంధించిన పత్రాలలో కొన్ని ఆంగ్ల పదాలను తెలుగు భాషకు తర్జుమా చేసే క్రమంలో సరైన పదాలను వాడాలని పలువురు రాజకీయ ప్రతినిధులు ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారిని కోరారు.స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన సలహాలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భారత్ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీవీ గజేంద్రరావు (బిజెపి), దిలీప్ కుమార్ (టీడీపీ), కొడాలి శర్మ (సిపిఐ(ఎం)), ఎస్. బాలాజీ (బీఎస్పీపి), మచిలీపట్నం ఉత్తర మండల తహసిల్దార్ నాగభూషణం, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల మహమ్మారిపై మూకుమ్మడి దాడి!

(మొదటిపేజీ తరువాయి)

కలుపుదామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని.. ఇందుకు ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్‌మెంట్) క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని ఆదేశించారు. వీటి సభ్యులకు వర్క్‌షాప్స్ నిర్వహించి.. డ్రగ్స్ అంటే ఏమిటి? డ్రగ్స్ ఉపయోగిస్తున్న వారిని గుర్తించడం ఎలా? సున్నితంగా సమస్యను ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హాట్‌స్పాట్స్‌ను గుర్తించి.. ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలు వ్యక్తుల జీవితాలను, కుటుంబాలను ఎలా నాశనం చేస్తాయనే విషయాలను క్షుణ్నంగా వివరించాలన్నారు. అదేవిధంగా పోస్టల్, కొరియర్ సంస్థల సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జనజాగృతికి అవసరమైన లఘు చిత్రాలు, కరపత్రాలు వంటివాటిని రూపొందించాలని ఆదేశించారు. యోగాంధ్ర మాసోత్సవాలు ముగిసిన అనంతరం నెల రోజుల పాటు విస్తృత స్థాయిలో మాదక ద్రవ్యాలపై పోరాటానికి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయ శాఖలు, ఎన్‌జీవోలు, డీఎల్ఎస్ఏ నిపుణులు తదితరుల భాగస్వామ్యంతో పెద్దఎత్తున ర్యాలీలు, వాకథాన్‌లు, సదస్సులు వంటి వాటిని నిర్వహించనున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్, ఈగల్ బృందాలు తీసుకుంటున్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్స్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను తెలియజేశారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 73 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామని, 175 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. 1,054 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వివరించారు. మూలాలను ఛేదించే విషయంపై ప్రత్యేక ఆపరేషన్స్ చేపడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ.. సమన్వయ శాఖల అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్‌ఫ్రీ నంబరు 1972 ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, డీ అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా. స్వరాజ్య లక్ష్మి, ఈగల్ ఎస్ఐ ఎం.వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రోటోకాల్ పాటించాలి: ఎంపీపీ గరుడ ప్రసాద్

**కృత్తివెన్ను జూన్ 16 మేజర్ న్యూస్ :** మండలంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలకు శంకుస్థాపనలకు తప్పనిసరిగా అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ కూనసాని గురుడు ప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. మండలంలో రొయ్యల, చేపల చెరువులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఆక్వా జోన్‌గా గుర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణంలో మార్పులు వల్ల గ్రామాలలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. జడ్పిటిసి మైల రత్నకుమారి మాట్లాడుతూ చిన్న గొల్లపాలెం ప్రాంతంలో కరెంటు సమస్య వస్తే లక్ష్మీపురం సబ్ స్టేషన్ వద్ద కరెంట్ నిలుపుదల చేయడం వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఏ ప్రాంతంలో కరెంటు సమస్యలు ఉంటే ఆ ప్రాంతంలో కరెంటు నిలుపుదల చేసుకొని సమస్యను పరిష్కరించే విధంగా విద్యుత్ సిబ్బంది కృషి చేయాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి



చాలామంది అధికారులు గైర్హాజరవ్వడం పట్ల ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విషయంలో రాజీ పడేది లేదని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను తప్పనిసరిగా సర్వసభ్య సమావేశానికి పంపించాలని లేనిపక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ గూట్ల శిరీష, ఎంపీడీవో, తహసిల్దార్ అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# కళాత్మక యోగాతో ప్రజలలో మరింత చైతన్యం...




(మొదటిపేజీ తరువాయి)

పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే టీమ్‌లను ఎంపిక చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలతో సోమవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలోని డాన్‌బాస్కో పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పోటీలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. ఎ.సిరి, జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ లు జ్యోతి ప్రజ్వోలన చేసి ప్రారంభించారు.

అనంతరం హెల్త్ డైరెక్టర్ డా. ఎ.సిరి మాట్లాడుతూ కళాత్మకమైన అంశాలతో కూడిన యోగాసనాలను ప్రదర్శించడం ద్వారా ప్రజలను యోగా పట్ల మరింత చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో వివిధ విభాగాలలో యోగాసనాలపై పోటీలను నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫోటోగ్రాఫీ, యోగా స్లోగన్, వంటి అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయి విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించనున్నామన్నారు. అంతార్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాసోత్సవాల ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షాలాధి మంది ప్రజలను చైతన్యవంతులను చేసి యోగాసనాల వైపు ఆకర్షితులను చేశామన్నారు. జనాభాలో కనీసం 40 శాతం రిజిస్ట్రేషన్ చేయించాలనే లక్ష్యంతో 2 కోట్ల 20 లక్షల మందిని యోగాలో రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో వీరికి శిక్షణ ఇచ్చామన్నారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేశామన్నారు. రిజిస్ట్రేషన్ అయిన వారందరికి యోగాపై శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతి జిల్లాలో మాస్టర్ ట్రైనర్స్‌ను గుర్తించి ఒక్కొక్క జిల్లాకు 100 మంది మాస్టర్ ట్రనర్స్‌తో ఐదు రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1లక్ష 25 వేల మంది శిక్షకులు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2 కోట్ల 20 లక్షల మంది ప్రజలకు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 15 కేటగిరిలో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపులలో గెలుపొందిన విజేతలు మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వచ్చారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా ప్రముఖ పర్యాటక కేంద్రాలను గుర్తించి పర్యాటకులతో యోగా శిక్షణ నిర్వహించాలని లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే 76 పర్యాటక కేంద్రాలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దిన చర్యలో భాగం చేసుకుని కనీసం 20 నిమిషాలు యోగా చేయాలన్నారు. యోగా మన జీవితంలో భాగం కావాలని, ఒత్తిడిని దూరం చేసి మానసిక ప్రశాంతతకు యోగా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో విజేతలు ఈనెల 20వ తేదీ ఉదయానికి విశాఖపట్నం చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 21వ తేదీ అంతార్జాతీయ యోగా దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో యోగా చేసే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా జిల్లా వార్డు గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించి పలు విభాగాలలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలో 10 లక్షల మందికి యోగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. జిల్లాలో 241 పడవలపై కృష్ణమ్మ ఒడిలో ఒకేసారి వందలాధిమంది యోగాసనాలతో ఫ్లోటింగ్ యోగా నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించామన్నారు. రాష్ట్ర స్థాయి విజేతల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు ఇతర జిల్లాల నుండి యోగా టీచర్లను న్యాయనిర్ణేతలగా నియమించామన్నారు. సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉంటూ మంచి ఆలోచనలతో మెరుగైన సమాజ సాధన దిశగా వికసిత్ భారత్, విజన్‌ఆంధ్ర 2047 సాధనకు యోగా దోహదపడుతుం దన్నారు. భారతదేశ విశ్వ గురు యోగా అని ప్రపంచ వ్యాప్తంగా 70 దేశాలలో యోగాను దినచర్యగా అనుసరిస్తున్నారని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అనంతరం వివిధ విభాగాలలో నిర్వహించే పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నాంచారయ్య, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహిలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించింది



మృతి చెందిన మత్స్యకారులు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద బోటు ప్రమాదంలో మత్స్యకారుల మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగాయలంక మండలం గుల్లలమోదకు చెందిన నాగిడి రాము, సంగమేశ్వరానికి చెందిన తమ్ము పోతురాజు అనే మత్స్యకారులు కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద జరిగిన బోటు ప్రమాదంలో నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మత్స్యకారుల మరణ వార్త కలచివేసింది
### టిడిపి నేత బొబ్బా

కోనసీమ జిల్లా అంతర్వేదిలో జరిగిన పడవ ప్రమాదంలో దివి ప్రాంతానికి చెందిన ఇరువురు మత్స్యకారులు మృతి చెందిన విషయం తనను కలచివేసిందని తెలుగుదేశం నేత బొబ్బా గోవర్ధన్ సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు.. రెండు నెలల వేట నిషేధం అనంతరం సముద్రంలో వేట చేసేందుకు వెళ్లిన నాగాయలంక మండలం గుల్లలమోద, సంగమేశ్వరం గ్రామాలకు చెందిన మత్స్యకారులలో ఇరువురు మృతి చెందటం, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటం దురదృష్టకర ఘటన అని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ పక్షాన అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పరంగా వారికి పరిహారం త్వరగా అందేలా కృషి చేస్తామని గోవర్ధన్ తెలిపారు.. ఈ సందర్భంగా మృతి చెందిన వారి కుటుంబాలకు గోవర్ధన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు..

### మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
### సాంప్రదాయ మత్స్యకారులు
### సేవాసమితి కార్యదర్శి లకనం

నాగాయలంక మండల పరిధిలోని గుల్లలమోద గ్రామానికి చెందిన మత్స్య కారుడు నాగిడి వెంకటేశ్వరరావుకు చెందిన చేపల బోటు కోనసీమజిల్లా, అంతర్వేది వద్ద సముద్రములో ప్రమాదానికి గురై ఇద్దరు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రములో చేపల వేట నిషేధం గడువు ముగియడంతో ఆరుగురు కలాసీలతో వేటకు వెళ్ళడం రెండవరోజునే ఈ ప్రమాదం జరగడం దురదృష్టకారణమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన భీమా పరిహారం సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. చనిపోయిన మత్స్యకారుల మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## సి.ఐ.టి.యు. జిల్లా ఉపాధ్యక్షులు త్రిమూర్తులు మృతి

**నందివాడ, మేజర్ న్యూస్:** సి.ఐ.టి.యు.జిల్లా ఉపాధ్యక్షులు త్రిమూర్తులు ఆకస్మిక మృతి కమ్యూనిస్టు ఉద్యమానికితీరనిలోటని గుడివాడ సి.పి.యం. సీనియర్, నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాయంలో సిపిఎం పార్టీమండల కార్యర్శి, ఆర్.సి.పి.రెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో కామ్రేడ్ మూర్తులు చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.సి.పి.రెడ్డి మాట్లాడుతూ నిస్వార్థంగా సమాజానికి సేవ చేసిన త్రిమూర్తులు ధన్యజీవి అన్నారు. ఈకార్యక్రమంలో సిపియం మండల కమిటీసభ్యులు పి.రజని,యల్.సురేంద్ర, యస్.యఫ్.ఐ. కృష్ణాజిల్లా కార్యదర్శి సమరం యస్.యఫ్.ఐ.పట్టణనాయకులు నాగేంద్ర, నవ్యాంధ్ర కార్మిక సంఘం అధ్యక్షులు కొమ్ములసురేష్, పార్టీసభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ అక్షర ప్రైమ్ కళాశాలలో యోగా శిక్షణ




**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** యోగాంధ్ర మాసం సందర్భంగా సన్నాహక యోగ శిక్షణ కార్యక్రమాలలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 అందరూ యోగ చేసేందుకు వీలుగా సన్నాహక యోగ శిక్షణ కార్యక్రమాల లో భాగంగా యన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణం లో గల శ్రీ అక్షర ప్రైమ్ కళాశాలలో సోమవారం కళాశాల ఛైర్మన్ గదుపూడి శ్రీరామ్, డైరెక్టర్ గదుపూడి కోటేశ్వరరావు వారి ఆధ్వర్యం లో యోగ శిక్షణ తరగతులు యోగ గురుజీ గాడిపర్తి సీతారామారావు నిర్వహించారు.ఈ సందర్భంగా యోగా గురుజి గాడిపర్తి సీతారామారావు మాట్లాడుతూ విద్యార్థిని ల లో చదువు పై ఏకాగ్రత కేంద్రీకరించుకొనేందుకు, యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రతిరోజు అందరూ యోగా చేయాలని అన్నారు. వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం,ధ్యానం నేర్పించడం జరిగింది. 95 మంది విద్యార్థినిలు వరకు ఈ యోగ శిక్షణ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గదుపూడి శ్రీరామ్, డైరెక్టర్ గదుపూడి కోటేశ్వరరావు, యోగాంధ్ర కో - ఆర్డినేటర్లు డాక్టర్. కృష్ణ మోహన్, డాక్టర్. కవిత, యోగ గురుజీ గాడిపర్తి సీతారామారావు, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

## సీజేఐకి వైసీపీ అభిమాని గౌతమ్ లేఖ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** టీడీపీ నేత కనపర్తి శ్రీనివాస రావు పై, ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్, సంపాదకీయ బృందం పై సుమోటోగా చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తికి వైసీపీ అభిమాని బడే గౌతమ్ లేఖ రాసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 07న ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి ఛానల్లో ప్రసారం చేసిన ఒక కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టులు, సీబీఐ కోర్టుల న్యాయమూర్తులు పదవి విరమణ తర్వాత వచ్చే పదవుల కోసం ఆశపడటం దుర్మార్గమని" చేసిన నిరాధారమైన, అవమానకరమైన వ్యాఖ్యలపై గౌతమ్ సీజేఐ కు లేఖ వ్రాసారు. న్యాయవ్యవస్థ, స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసేలా, న్యాయమూర్తుల పరువు నష్టం కలిగించేలా, అపకీర్తికరమైన ప్రకటనలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కోర్టు ధిక్కార చట్టం, 1971 లోని సెక్షన్ 15 కింద సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు తీసుకోవాలని గౌతమ్ అభ్యర్థించారు.

## భర్తను హతమార్చిన భార్య అరెస్ట్

**చల్లపల్లి, మేజర్ న్యూస్:** అనారోగ్యంతో, మతిస్థిమితం సరిగాలేని భర్తను కర్రతో కొట్టిచంపిన భార్య బోలెం మంగమ్మను సోమవారం చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అరెస్ట్ చేశారు. దేవరకోటకు చెందిన బోలెం శ్రీనివాసరావును 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకుని పెళ్ళయిన కొద్దికాలానికే గొడవపడి వెళ్లిపోయిన మంగమ్మ పెన్షన్ సొమ్ముల కోసం మళ్లీ భర్త దగ్గరకు వచ్చి కొన్నాళ్లు దేవరకోటలో ఉండి భర్తను తీసుకుని చల్లపల్లి వచ్చేయటం, తరచుగా భర్తను కొడుతున్న ఆమె శనివారం కర్రతో కొట్టడంతో అతడు చనిపోయిన సంగతి తెలిసిందే. భర్తను మామ, మరిది కొట్టివెళ్లారనీ, ఆ నెపాన్ని వారిపై మోపేందుకు మంగమ్మ ప్రయత్నించగా పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టి ఆమెను అదుపులోకి తీసుకుని విచారించటంతో అసలు విషయం బయటపడింది. మంగమ్మ కొట్టిన కారణంగానే శ్రీనివాసరావు మృతిచెందినట్లు ధృవీకరించుకున్న పోలీసులు భార్యపై హత్యకేసు నమోదు చేయగా, నిందితురాలిని సీఐ ఈశ్వరరావు అరెస్ట్చేసి మొవ్వ కోర్టులో హాజరుపరిచారు. మొవ్వకోర్టు ఇన్చార్జి న్యాయమూర్తి నిందితురాలికి రిమాండ్ విధించారు.

## నందిగామ మున్సిపల్ కమిషనర్గా జి.లోకారాజు



**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** పట్టణం లోని నందిగామ మున్సిపాలిటీ నూతన కమిషనర్గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనర్ జి.లోవ రాజు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.






## మద్యం సేవించి వాహనాలు నడిపిన 50 మంది వ్యక్తులకు జరిమానా

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపధ్యంలో సోమవారం 1వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 50 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఏడవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ (రైల్వే కోర్టు) కోర్ట్ లో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి ఆర్.వి.ఎస్.శర్మ మొత్తం 50 మందికి ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున రూ.5,00,000/-, జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర్ బాబు తెలియజేశారు.

## మండలి ఫాంట్ ద్వారా వంద దేశాల్లో ప్రచురణలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తెలుగు ఫాంట్స్ రూపకల్పనకు ఉమ్మడి రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులుగా మండలి బుద్ధప్రసాద్ కృషి అపూర్వమని మలేషియా కస్తూరి విజయం పబ్లికేషన్స్ సహ వ్యవస్థాపకులు సుధీర్ రెడ్డి పామిరెడ్డి అన్నారు. అవనిగడ్డలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి తెలుగు వెలుగు పుస్తకాన్ని బహుకరించారు. ఈ సంద ర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోనే తెలుగు గూ గుల్ ఫాంట్స్, స్పెల్ చెకర్ అవసరాన్ని దూరదృష్టితో బుద్ధప్రసాద్ గుర్తించి అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సహకారంతో తెలుగు గూగుల్ ఫాంట్స్ తయారు చేయించి గూగుల్ సహకారంతో వినియోగంలోకి తెచ్చారన్నారు. నాటి ఫాంట్స్ లో ఒకటైన మండలి ఫాంట్ ద్వారా తమ పబ్లికేషన్ ద్వారా నాలుగు సంవత్సరాల నుండి 125 పుస్తకాలు వంద దేశాల్లో ప్రింట్ ఆన్ డిమాండ్ పద్ధతిలో తెలుగు రచనలు, పరిశోధనాత్మక గ్రంథాలు, కవితలు ప్రచురిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ ఆయనను ఘనంగా సత్కరించారు.

### రూరల్ ఎస్సై ఎన్ చంటిబాబు ఆధ్వర్యంలో
## 1700 కేజీల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**నందివాడ,మేజర్ న్యూస్:** గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మల్లాయపాలెం సమీపంలో బైపాస్ రోడ్ వద్ద సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబుకి పీడీయస్ రైస్ అక్రమ రవాణా గూర్చి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మధ్యవర్తుల సమక్షంలో వాహన తనిఖీ చేపట్టి పై ప్రదేశంలో ఏపి 39 డబ్బ్యూ 5267 నంబర్ గల మినీ వ్యాన్ లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 34 బస్తాల్లో ఉన్న 1700 కేజీల రేషన్ బియ్యంను, సదరు వాహనాన్ని సీజ్ చేసి వ్యాన్ డ్రైవర్ యండమూరి సీతారాముడు, తండ్రి పేరు త్రిమూర్తులు, వయస్సు 40 సం" కులం సూర్య బలిజ, పామర్రు గ్రామం,, లోడ్ చేసే సహాయకుడు అయిన పెద్ది రామచంద్రరావు, తండ్రి పేరు అప్పన్న, వయస్సు 45సం., కులం తూర్పు కాపు, కొత్తపేట, గుడివాడ అను వారిని అదుపులోకి తీసుకున్నారు,, అక్రమ రేషన్ బియ్యం కొనుగోలు దారుడు అయిన పెద్ది అర్జునరావు, తండ్రి పేరు అప్పన్న, వయస్సు 41 సం"కులం తూర్పు కాపు, కొత్తపేట, గుడివాడ పట్టణ వ్యక్తి నీ అరెస్ట్ చేయవలసి ఉందన్నారు.కాగా దీనిపై గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో "70" ఫిర్యాదులు

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 70 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాధాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 42, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 05, దొంగతనాలకు సంబంధించినవి 02, కొట్లాటకు సంబంధించినవి 01, సైబర్ నేరాలకు సంబంధించి 03, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 05, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 12, మొత్తం 70 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ నిర్వహించారు. ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 14 ఫిర్యాదులు ఉండగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 6, ఇంజనీరింగ్ 2, రెవెన్యూ సంబంధించినవి 2, వైద్య, ఆరోగ్యం 3, ఎస్టేట్ 1 మొత్తం కలిపి 14 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్. డాక్టర్ డి చంద్రశేఖర్ తో పాటు చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



**మొవ్వ మేజర్ న్యూస్:** కూచిపూడి సిద్ధేంద్ర ఓరియంటల్ హైస్కూల్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వపు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు స్వర్గీయ ముక్తినూతలపా టి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వి హర్షిత, అరుణ లకు ప్రధమ, ద్వితీయ స్థానాలు సాధించడంతో ఆ విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు నగదు ప్రోత్సాహం బహుమతులు అందించారు. అలాగే తృతీయ స్థానం సాధించిన వీ రమ్యకు 2వేలు నగదు ప్రోత్సాహ బ హుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు లు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, ఉపాధ్యాయులు ఉషారాణి మాణిక్యా లరావు, కవిత, దాతలు ఉదయభాస్కరరావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యతతో అర్జీల పరిష్కారం ఉండాలి...





### పునరావృతం కాకుండా సమస్య పరిష్కరించాలి..

### జిల్లాలో 157 ఆర్జీల నమోదు : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, జూన్ 16, మేజర్ న్యూస్ :** నాణ్యతతో ఆర్జీలకు పరిష్కారం చూపాలని, పునరావృతం కాకుండా సమస్యను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అధి కారులు సిబ్బంది నుండి సమాచారం సేకరించి పరిష్కారం చూపాలన్నారు. ఆర్జీలు ఏ స్థాయిలోను పునరావృతం కాకూడదని, సమస్య పరిష్కారంతో అర్జిదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వ నిర్ధేశించిన లక్ష్యాన్ని నేరవేర్చాలని అన్నారు. ప్రతి ఆర్జీకి అర్థవంతమైన సమాదానం ఇస్తూ పరిష్కరించాలని ఆర్జీలను ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఆర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వచ్చే ఆర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని, ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 45, పోలీస్ శాఖకు 19, ఎంఎయుడి 17, విద్య 16, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ 10, డిఆర్‌డిఏ 9, పౌరసరఫరాలు 4, ఏపిసిపిడిసిఎల్ 3, హెల్త్ 3, పంచాయతీరాజ్ 3, ఆర్అండ్‌బి 3, ఆర్‌డబ్ల్యుఎస్ 3, కళాశాల విద్య 2, విభిన్నప్రతిభావంతులు 2, గ్రామ వార్డు సచివాలయం 2, ఇంటర్మీడియట్ 2, మార్కెటింగ్ 2, గనులు, భూగర్భ 2, రిజిస్ట్రేషన్ 2, నైపుణ్య అభివృద్ధి 2, సర్వే 2, వ్యవసాయం, బ్యాంకు రిలెటెండ్, కో%-%ఆపరేటివ్, మెప్మాకు సంబంధించిన ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 157 అర్జీలను స్వీకరించడం జరిగిందని ఇందులో 42 అర్జీలను స్వయంగాను 115 అర్జీలను ఆన్‌లైన్ ద్వారా స్వకరించిన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అవగాహన లోపంతో అర్జీల పరిష్కారం తప్పుగా చేస్తున్నారు

### తప్పును సరిదిద్దుకొని సరైన పద్ధతిలో అర్జీలు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో చాలామంది అధికారులు అవగాహన లోపంతో అర్జీల పరిష్కారం తప్పుగా చేస్తున్నారని ఇకనైనా తప్పును సరిదిద్దుకొని సరైన పద్ధతిలో అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ మీకోసం కార్యక్రమం డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మెప్మా పిడి సాయిబాబు, మచిలీపట్నం ఆర్ డి ఓ కే స్వాతి, సర్వ శిక్ష ఏపీసి కుమిదిని సింగ్ లతో కలిసి నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా అర్జీదారుల సమస్యలను ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగుల పట్ల జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి వేదిక నుండి దిగివచ్చి సమావేశం మందిరం బయట ఉన్న వారి వద్దకు వచ్చి వారి సమస్యలను ఎంతో ఓపికగా అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించారు. చల్లపల్లి మండలం తాలిపేట గ్రామానికి చెందిన కప్పిరి సుబ్బారావు తనకు ఎలాంటి మూడు చక్రాల వాహనం లేదని ఇతరుల చక్రాల కుర్చీలో వచ్చానని, బ్యాటరీ వాహనము ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు ప్రశాంతిని పిలిపించి వెంటనే పి జి ఆర్ ఎస్ మీకోసం కార్యక్రమం పూర్తయ్యేలోగా ఒక బ్యాటరీ మూడు చక్రాల వాహనాన్ని తెప్పించాలని సూచించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అతనికి జిల్లా కలెక్టర్ మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందజేశారు. దీంతో అతని సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా అతను జిల్లా కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు.మరో దివ్యాంగులు గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శ్రీకాంత్ ఇతరుల చక్రాల కుర్చీలో కలెక్టరేట్కు వచ్చి తనకు అంత్యోదయ అన్న యోజన కార్డు ఉన్నప్పటికీ ఇదివరకు ఎండియు వాహనం ద్వారా జె.రవికుమార్ కేవలం ఐదు కిలోల బియ్యం మాత్రమే ఇచ్చేవారని ప్రస్తుతం ఉన్న చౌక దుకాణం డీలర్ డి బలరాము తనకు 35 కిలోల బియ్యం ఇచ్చారని తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి డిఎస్ఓ వీ పార్వతిని పిలిపించి ఈ విషయమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దివ్యాంగులు శ్రీకాంత్ తనకు మూడు చక్రాల బ్యాటరీ వాహనం కావాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేయగా అతనికి కూడా ఒక మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందజేయాలని వయోవృద్ధులు దివ్యాంగుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు ప్రశాంతికి సూచించారు. కలెక్టరేట్లో మొత్తం 133 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులతో మాట్లాడుతూ అర్జీదారులు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ప్రభుత్వ పాలసీ ప్రకారం త్వరలో మంజూరు అవుతుందని సంబంధిత అర్జీదారునికి సమాధానం తెలియజేస్తూ అర్జీదారుని పరిష్కార పోర్టల్ లో లబ్ధి పొందినట్లుగా పేర్కొంటున్నారని ఇది చాలా తప్పని జిల్లా కలెక్టర్ సోదాహరణంగా స్పష్టం చేశారు. ఆ పౌరుడు లబ్ధి పొందకనే పొందినట్లుగా పేర్కొనడం తప్పు అన్నారు. ఇకపై అందుకు బదులుగా త్వరలో లబ్ధి పొందుతారు అనే ఐచ్చికాన్ని (ఆప్షన్) ఎంచుకోవాలన్నారు. అర్జీదారుడు లబ్ధి పొందినట్లుగా పేర్కొంటే వెంటనే కాల్ సెంటర్ నుండి ఫోన్ చేసి లబ్ది పొందారా లేదా అని వివరాలు అడుగుతారన్నారు. అప్పుడు వారు ఇంకా పొందలేదని చెప్పడం వల్ల తప్పైపోతుందన్నారు. అర్జీదారుని సమస్యను ఓపికగా విన్నారా లేదా అని విచారిస్తున్నారని అందువలన అర్జీదారుల పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అర్జీదారుని దగ్గరకు వెళ్ళినప్పుడు అతనితో కలిసి ఫోటోలు తీసుకుని ఉన్నతాధికారులకు షేర్ చేయాలన్నారు. అర్జీదారులతో తప్పనిసరిగా అర్జీ పరిష్కరించు అధికారే మర్యాదగా మాట్లాడాలని, క్రింది స్థాయి ఉద్యోగుల చేత మాట్లాడించరాదని, ఖాళీ ఎండార్స్మెంట్ ఇవ్వరాదని, ఈ విషయం తీవ్రంగా పరిగణించి ఇకనైనా సరైన సమాధానం అర్జీదారులకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ కే కన్నమనాయుడు, డ్వామా, డి ఆర్ డి ఏ. పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డిపిఓ జే. అరుణ, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నటరాజు, లోకేష్,డీఎస్ఓ వి పార్వతి, డిఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా ఐ సి డి ఎస్ పి డి ఎం ఎన్ రాణి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డి టి డబ్ల్యూ ఫణి ధూర్జటి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీలను మూసివేయాలంటూ అధికారుల ఆదేశాలపై కార్మికుల ఆగ్రహం



**తోట్లవల్లూరు జూన్ 16 మేజర్ న్యూస్ :** దేవుడు వరమిచ్చినా... పూజారి అడ్డుకుంటున్నట్లు గా జిల్లా అధికారుల వ్యవహార శైలి ఉందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నదులలో ఉన్న క్వారీల ద్వారా ఇసుకను రవాణా చేసేందుకు అనుమతులు మంజూరు చేయగా జిల్లా అధికారులు అందుకు విరుద్ధంగా ఇసుకతవ్వకాలను నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వడం పట్ల పలువురు ఇసుక కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని నదులలో ఇసుక కార్మికులు పనిచేస్తుండగా ఒక్క కృష్ణా నదిలో మాత్రమే ఎందుకు అపారని వారు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని చాగంటిపాడు, దేవరపల్లి గ్రామాల ఇసుక క్వారీలలో పనిచేస్తున్న కార్మికులు ఈ మేరకు సమావేశం నిర్వహించారు. కృష్ణానది తీరం వెంబడి కృష్ణా జిల్లాలో దాదాపు పదివేల మంది ఇసుక కార్మికులు జీవనం సాగిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికుల బ్రతుకు తెరువు కోసం జీవో ఇచ్చారని, ఆయన మాటకు విలువ లేకుండా జిల్లా అధికారులు చేస్తుండటం విచారకరమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో మూడు నెలల తర్వాత వచ్చే వరదకు ఇప్పుడు ఇసుక తవ్వకాలు ఎందుకు నిలిపివేశారో తెలియటం లేదన్నారు. చాగంటిపాడు, దేవరపల్లి గ్రామాల పరిధిలో గల ఇసుక క్వారీలలో తవ్వకాలను నిలిపివేయాలంటూ జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారని స్థానిక అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేయడం తమను విస్మయానికి గురిచేసిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాంలకు తెలియపరచి, వారి ద్వారా తమకు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించనున్నట్లు కార్మికులు తెలిపారు.



## రసాయనిక ఎరువులు ఉపయోగించడం వలన భూసారం తగ్గుతుంది

**గన్నవరం, జూన్ 16, మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, బుద్ధవరం గ్రామంలో గన్నవరం డివిజినల్ వ్యవసాయ అధికారి (ఏడిఏ) ఎం.సునీల్ పంట పొలాల పరిశీలనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట ఎరువులు జీలుగ వేసిన రైతులతో ఆయన మాట్లాడుతూ.,భూసారం ఎంత పెరిగితే, అందులో మనం పండించే పంటలు అంతగా దిగుబడిని అందిస్తాయని రైతులకు వివరించారు. వ్యవసాయ రంగంలో చాలా మంది రైతులు రసాయన ఎరువులు వాడుతుంటారని., కానీ దీనివల్ల కొన్ని సంవత్సరాలల్లో నేలలో సారం తగ్గిపోయి, పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని సునీల్ పేర్కొన్నారు. అందువల్ల వీలైనంత రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడుకోవాలని ఏడిఏ సునీల్ రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుద్ధవరం గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.సాగర్, రైతులు పాల్గొన్నారు.

## సంచారజాతుల అభివృద్ధి కొరకు చొరవ చూపాలి



చల్లపల్లి, మేజర్ న్యూస్ : ప్రభుత్వ నిబంధనల సడలింపులతో సంచార జాతుల ప్రజల అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు కృషిచేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. స్థానిక కోమలా థియేటర్ సమీపంలో మూడేళ్లుగా రోడ్డుపక్కనే నివసిస్తున్న మూడు సంచార జాతుల కుటుంబాల దయనీయ జీవన స్థితిగతులను సోమవారం చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నారులకు పదేళ్లు దాటుతున్నప్పటికీ పాఠశాల ముఖం చూడకపోవటం, ఆధార్ కార్డులు లేవనే కారణంతో ప్రభుత్వ పథకాలు అందటంలేదని తెలిపారు. ఆయా కుటుంబాలకు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆధార్ తోపాటు ఇతర ధృవీకరణ పత్రాలు మంజూరు అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరగా, స్పందించిన తహసీల్దార్ వారికి నివాస, పుట్టినతేదీ ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు

## జగ్గయ్యపేటలో సబ్ కోర్టు మంజూరు చేయాలని వినతి



**జగ్గయ్యపేట,జూన్ 16,మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి వారిని మర్యాద పూర్వకంగా కలిసి, దస్త్రాల దశలో ఉన్న జగ్గయ్యపేటకు సబ్ కోర్ట్, పెనుగంచిప్రోలు సివిల్ జూరిస్డిక్షన్ మంజూరు చేయు అంశములపై త్వరితగతిన నివేదికను హైకోర్టు వారికి సమర్పించవలసినదిగా కోరిన జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు.పశ్చిమ కృష్ణాలో ప్రధాన పట్టణమైన జగ్గయ్యపేటలో సబ్ కోర్ట్ లేని కారణంగా అలాగే పెనుగంచిప్రోలు సివిల్ జూరిస్డి క్షన్ జగ్గయ్యపేటకు అనుసంధానం కాకపోవడం వలన న్యాయవాదులు, కక్షిదారులు అనేక వ్యయ, ప్రయాసలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున వారి ఇబ్బందులను పరిగణ లోకి తీసుకొని జగ్గయ్యపేటకు సబ్ కోర్ట్ను అదే విధంగా పెనుగంచిప్రోలు సివిల్ జూరిస్డిక్షన్ మంజూరు చేయవలసినదిగా కోరుతూ గతంలో హైకోర్టు వారికి, జిల్లా కోర్ట్ వారికి జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ వారు వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఇందుపై సానుకూలంగా స్పందించి న హైకోర్టు వారు సమగ్ర వివరములతో నివేదిక సమర్పించవలసినదిగా జిల్లా కోర్ట్ వారిని ఆదేశించి యున్నారు.ఇట్టి దస్త్రాల దశలో గల జగ్గయ్యపేటకు సబ్ కోర్ట్, పెనుగంచిప్రోలు సివిల్ జూరిస్డిక్షన్ మంజూరు విషయమై సమగ్ర నివేదికను త్వరితగతిన గౌ"హైకోర్టు వారికి సమర్పించవలసినదిగా జగ్గయ్య పేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు గౌ" కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు, సెక్రటరీ సుధాకర్, బార్ సభ్యులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన 'దేశం' నాయకులు



**పామర్రు జూన్ 16 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ మార్కెట్ యార్డ్ లో జరిగిన శీలం చింతేశ్వరరావు కుమార్తె వివాహ వేడుకలలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య, పార్టీ నాయకులు చాట్ల రమేష్, కేదరాశిపల్లి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నే స్టాంపులు అందజేయాలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయంలో 50 రూపాయలు, 100 రూపాయలు స్టాంపులు అందుబాటులో ఉంచి వినియోగదారుల కు అందజేయాలని జనసేన పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు చన్నగిరి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రిజిస్టర్ ఆఫీసులో సిబ్బందికి పని భారం పడుతుందని ఈ కార్యక్రమానికి స్వస్తి పలికి స్థానిక స్టాంప్ వెండర్ల కు అందజేసామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారన్నారు. స్టాంప్ వెండర్స్ దగ్గర అవసరమైన స్టాంపులు లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్టాంపు వెండర్ దగ్గరికి వెళ్ళినప్పుడు మా దగ్గర రూ.10 స్టాంపులే ఉన్నాయని, పది రూపాయల స్టాంప్ కి 30 రూపాయలు వసూలు చేస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే మాకు గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. తక్షణం అవనిగడ్డ రిజిస్టర్ స్పందించి రిజిస్టర్ ఆఫీసులో కౌంటర్లో 50 రూపాయలు 100 రూపాయల స్టాంప్ లు అందుబాటులో ఉంచి వినియోగదారులకు సప్లై చేయవలసిందిగా కోరుతున్నారు.

## గుడ్లవల్లేరులో అన్నదాత సుఖీభవ రైతుల వెరిఫికేషన్



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూన్ 16 :** గుడ్లవల్లేరు మండలంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2025 గాను రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు రైతులు వేలిముద్ర తీసుకుని వెరిఫికేషన్ చేస్తున్నారు. గుడ్లవల్లేరుమండలంలో అర్హులైన 6458 మంది రైతుల జాబితా ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల లాగిన్‌లో పొందుపరచడం జరిగిందని, రైతులు తమ రైతు సేవ కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుని వద్ద ఈనెల 20వ తారీకు లోపల రైతు యొక్క వేలిముద్రలు ద్వారా వెరిఫికేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సునీల్ కోరారు. దీంతో గుడ్లవల్లేరు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయంల వద్ద రైతుల వేలిముద్ర తీసుకుని గుడ్లవల్లేరు వ్యవసాయ సహాయకులు జి. ప్రసన్న కుమార్ సోమవారం వెరిఫికేషన్ చేస్తున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.

## మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా



**కోడూరు మేజర్ న్యూస్ :** ఉగాది నుండి ఇప్పటి వరకు రెండు పూటలా మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా ఆగకుండా జరుగుతోంది. కోడూరు మండలం, నాగాయలంక మండలాలలో కోడూరు మండలం చింత కోళ్ల,నాగాయలంక మండలం సంగమేశ్వరం గ్రామాలలో మంచినీటిని సరఫరా చేస్తున్న మన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ సోమవారం తీర గ్రామాల దాహం తీర్చేందుకు నలభై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా కోడూరు మండలం చింత కోళ్ల, నాగాయలంక మండలం సంగమేశ్వరం గ్రామాలకు తాగునీరు అందచేశారు..

## వీరంకిలాకులో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహణ



**పమిడిముక్కల జూన్ 16 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అఖిల ఆధ్వర్యంలో సోమవారం మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి రాకుండా చేపట్టాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగింది. అలాగే మలేరియా వ్యాధికి గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కూడా వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు చేపట్టాలని, అవసరమైతే ఇళ్లలో దోమతెరలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### అతిసార వ్యాధి నిర్మూలనపై అవగాహన

ఈనెల 16వ తేదీ సోమవారం నుండి జూలై 31వ తేదీ వరకు జరగనున్న అతి సారవ్యాధి (డయేరియా) నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు డాక్టర్ అఖిల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారంపై మూతలు ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అలాగే ఎవరికైనా విరోచనాలు అవుతున్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలని, మరీ ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు. అలాగే 14 రోజులపాటు జింకు చరపును తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అఖిల డాక్టర్ సాయిరా ఖాతునే, సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగలు సైతం దోచుకోలేని సంపద ఏదైనా ఉందంటే అది విద్య మాత్రమే...



**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో బాబు జగ్జీవన్ రామ్ బిల్డింగ్‌లో సోమవారం తల్లి వందనం క్రింద తల్లుల ఖాతాలకు నగదు జమ అయినందున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసిన తల్లిదండ్రులను మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కూటమి నేతలు, నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి చేసిన ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించి విద్యారంగంలో నూతనశకానికి నాంది పలుకుతున్న యువనేత రాష్ట్ర విద్యాశాఖ ఐటీ మంత్రి నారా లోకేష్ ఈ రాష్ట్ర మంత్రిగా ఉండటం మన అదృష్టం.యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎముకలు కొరికే చలిలో సైతం విదేశీ పెట్టుబడులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యువకునిలా పరుగులు పెట్టటం మనమందరం చూసాం.రాష్ట్రంలో యువత పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళిపోకుండా వారికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకురావటం పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేకమైన ధన్యవాదాలు. గత ముఖ్యమంత్రి మీకు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మ ఒడి ఇస్తానని చెప్పి ఆ తరువాత మాట మార్చి తల్లులు ఎంతమంది పిల్లలను చదివించిన నేను మాత్రం ఒక్కరికే అమ్మ ఒడి ఇస్తాను మీ ఇష్టం అని ఇచ్చిన హామీని గాలికి వదిలేసాడు, తల్లికి వందనం క్రింద తల్లుల ఖాతాలకు జమ కాబడిన నగదును దుర్వినియోగం చేయకుండా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లల భవిష్యత్ ప్రణాళికను రూపొందించే విధంగా దృష్టి పెట్టాలని తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులు నేటి పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తు రోజులలో వారి జీవనశైలికి బంగారు బాటలు వేసుకుని ప్రతి ఒక్కరూ నలుగురికి ఆదర్శప్రాయంగా ఉండాలని విద్యార్థిని విద్యార్థులకు ఆమె ఆశీస్సులు తెలియజేశారు.కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, అధికారులు, కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**కృత్తివెన్ను జూన్ 16 మేజర్ న్యూస్ :** మండలంలోని సీతనపల్లి ఎస్సీ కాలనీలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ ముంద్రు ఏసుపాదం, నాయకులు చింతల మోజెష్, ఈద యేబురాజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పంట కాలువలు, డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు



**ఘంటసాల, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలో పంట కాలువలు, డ్రైనేజీ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన పంట కాలువలు, మురుగు కాలువల్లో ఆపరేషన్స్ అండ్ మైంటనెన్స్ నిధులతో తూటికాడ, గుర్రపు డెక్క నిర్మూలన పనులు చురుకుగా సాగుతున్నాయి. వేములపల్లి, యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి, పుచ్చగడ్డ, దేవరకోట వరకూ పన్నెండు కిలోమీటర్లు ప్రవహించి ఆయకట్టు మురుగును గుండేరులో కలిపే చిల్లలవాగు డ్రైనేజీలో స్ప్రేయింగ్ పనులు ఘంటసాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ పనులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘంటసాల మండలం దేవరకోటలో పరిశీలించారు. రైతులకు వ్యవసాయ సీజనులో ఏ విధమైన ముంపు సమస్య తలెత్తకుండా పనులు చేయించాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో కాకతీయ స్విమ్మింగ్ అకాడమీ విద్యార్థులు



**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** హైదరాబాద్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో నందిగామ కాకతీయ సిమ్మింగ్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. ఈనెల 14.15 తేదీలలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వారు 50 మీటర్ల సిమ్మింగ్ హెచ్ పి ఎస్ ఛాంపియన్షిప్ కప్ పోటీలను హైదరాబాదులో బేగంపేట్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు నందిగామ నుండి కాకతీయ స్విమ్మింగ్ అకాడమీ విద్యార్థులు మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారు.ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అదే విధంగా బహుమతులు గెలిచిన విద్యార్థులందరికీ కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్,భారతి. డైరెక్టర్స్ కాపా కార్తికేయ స్ఫూర్తి సుష్మ ప్రిన్సిపల్ సత్యమూర్తి ఉపాధ్యాయులు. కోచ్ గోపీచంద్ హైదరాబాదులో నందిగామ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నందిగామ పేరును జాతీయ స్థాయిలో కూడా ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులు తెలియజేశారు.మొత్తం 8 బంగారు వెండి పసిడి పథకాలు నందిగామ విద్యార్థులు సాధించినారు.

## నదిలో గల్లంతైనా ఫణి కుమార్ మృతదేహం లభ్యం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఘంటసాల మండలం శ్రీకాకుళం కృష్ణానదిలో ప్రమాదవశాత్తు గల్లంతైనా గ్రామానికి చెందిన ఆత్కూరి ఫణి కుమార్ మృతదేహం లభ్యమైంది. ఆదివారం ప్రమాదవశాత్తు పడి గల్లంతు కాగా సమాచారం అందుకున్న ఎస్సై ప్రతాప్ రెడ్డి పడవల మీద గాలింపు చేపట్టగా ఫణి కుమార్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కృష్ణానదిలో గల్లంతైన ఫణి కుమార్ మృతదేహం ఆచూకీ లభ్యం కావడంతో ఒడ్డుకు చేర్చారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక కొడుకు ఇలా చనిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు.

## యోగ సాధనతో ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుంది... ఆర్డీఓ కే స్వాతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బాలికలు యోగ సాధన చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని లేడీ ఆంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600 మంది విద్యార్థినులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగ మాస్టర్ ముదిగొండ శాస్త్రి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి సాల్మన్ రాజు ఈ యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థినులతో భ్రమరి ప్రాణాయామం, కపాలభాతి, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలికలు యోగా సాధన చేయడం వలన ఋతు క్రమం సక్రమంగా జరుగుతుందన్నారు. విద్యార్థినులు ధ్యానం చేయడం వలన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకి శెట్టి హరినాథ్, కళ్యాణి స్పందన తదితరులు పాల్గొన్నారులేడీ ఆంప్తిల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే స్వాతి, ఇంటర్మీడియట్ అధికారి వృక్షాసనం వేయడం చెప్పుకోదగ్గ విశేషం.





## తల్లుల మనసును చూరగొన్న కూటమి ప్రభుత్వం

**మచిలీపట్టణం మేజర్ న్యూస్ :** తల్లికి వందనం, కార్యక్రమం ద్వారా 13వేల రూపాయల చొప్పున, ఆ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నిధులు విడుదల చేసి తల్లుల మనసును కూటమి ప్రభుత్వం చూరగొన్నదని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు పంచాయతీలోని వన్నారు కానూరు ఉన్నత పాఠశాలలో గోపు ఆధ్వర్యం లో తల్లికి వందనం విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.గోపు సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని అన్నారు. అందులో భాగంగా తల్లికి వందనం విడుదల చేయడం వలన తల్లులు విద్యార్థుల కళ్ళల్లో కోటి కాంతులు వికసించాయన్నారు. ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వం లో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి ఇచ్చారని, కానీ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు, కుటుంబంలోని పిల్లలందరికీ తల్లికి వందనం పైకం జమ చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం 42 లక్షల మంది విద్యార్థులకి అమ్మఒడి వేసిందని, కూటమి ప్రభుత్వం 67,27,164 మంది విద్యార్థులకి 13,000 వేల రూపాయలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేసారన్నారు.జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్,పి. రాము, బొమ్మిడి పెద ఏడుకొండలు, బొలిశెట్టి నాని,బొమ్మిడి కొండలరావు, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, యేసు, ఇమ్మాన్యువల్, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర రావు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, బ్యూలా,ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ వర్కర్స్, బుక్ కీపర్లు, అంగన్వాడీ వర్కర్స్, హైస్కూల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎమ్మెల్యే శ్రీరాం



**జగ్గయ్యపేట,జూన్ 16, మేజర్ న్యూస్ :** చదువు పూర్తి చేసుకుని పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధికి పాటుపడాలని, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఊ అన్నారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణం 22 వార్డు మిట్టగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టగర్ల్స్ హై స్కూల్ఊ లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు బ్యాగ్స్, ఇంటర్ విద్యార్థులకు బుక్స్ ను స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఊ విద్యార్థులకు బుక్స్ బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం,విధేయత,సంస్కారం,మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు.విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో రాణించడం వల్ల విద్య ఉద్యోగాల్లో వారికి మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు.చదువు పూర్తిచేసి ఉద్యోగాలకు పరిమితం కాకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడేలా సేవలందించాలన్నారు.సాంకేతిక రంగంలో ఇంజినీర్లు,వ్యవసాయ రంగంలో ఆగ్రికల్చర్ విద్యార్థులు సేవలందించి గుర్తింపు పొందాలన్నారు.చాలా మంది విదేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని అన్నారు.ఇంతటితో చదువును ఆపకుండా ఉన్నత చదువులు చదివేందుకు ప్రయత్నించాలని కోరారు.వ్యవసాయ రంగంలో మాస్టర్స్ చదివే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని,ప్రపంచంలో ఎక్కడికు వెళ్లినా మంచిస్థాయిలో స్థిరపడుతారన్నారు.విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు గొప్పస్థాయిలో స్థిరపడి మంచి పేరును సంపాదించాలని కోరారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వార్డ్ కౌన్సిలర్ గోట్టే నాగరాజు,స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి లత,స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి,15వ వార్డ్ కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లు రవీంద్రను విమర్శించే స్థాయి నీది కాదు



## వైసీపీ నేత పేర్ని కిట్టుపై టీడీపీ మహిళా నేతల ఫైర్..

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే స్థాయి వైసీపీ నేత పేర్ని కిట్టుకు లేదని నియోజకవర్గ టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో టీడీపీ నగర, రూరల్ కమిటీ నాయకులు, తెలుగు మహిళా విభాగం నాయకురాళ్లు వేర్వేరుగా పాత్రికేయుల సమావేశం నిర్వహించి మంత్రి కొల్లు రవీంద్రపై పేర్ని కిట్టు చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నంలో ఏదైన అభివృద్ధి జరిగిందా..? అంటే అది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్న విషయాన్ని పేర్ని కిట్టు, అతని తండ్రి పేర్ని నాని తెలుసుకుంటే బాగుంటుందన్నారు. పదవులను అడ్డం పెట్టుకుని వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకున్నది మీ తండ్రి పేర్ని నాని కాదా..? అని ప్రశ్నించారు. బందరు పోర్టు గురించి మాట్లాడే కనీస అర్హత పేర్ని కుటుంబానికి లేదన్నారు. ముడుపులకు కక్కుర్తి పడి నాడు పోర్టును గోగులేరుకు అమ్మింది మీ తండ్రి కాదా..? అని ప్రశ్నించారు. నాడు కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు నేతృత్వంలో పోర్టు సాధన సమితిని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన విషయాన్ని మరచిపోయారా..? అని ప్రశ్నించారు.పోర్టు కోసం తన ప్రాణాన్ని కూడా త్యాగం చేసేందుకు సిద్ధపడిన వ్యక్తి కొల్లు రవీంద్ర అని అన్నారు. నాడు కొల్లు రవీంద్ర చేసిన ఆమరణ దీక్షకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దిగి వచ్చి బందరు పోర్టుకు స్థానికంగా శంకుస్థాపన చేశారన్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం విప్ పదవి కోసం పోర్టును మరోసారి మరుగున పెట్టిన వ్యక్తి పేర్ని నాని అని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన కొల్లు రవీంద్ర పోర్టు కోసం భూసేకరణ చేపట్టారన్నారు. ఆ సమయంలోనూ పోర్టు భూసేకరణను అడ్డుకునేందుకు పేర్ని నాని రైతుల్లో లేనిపోని అపోహలు సృష్టించి పోర్టు గ్రామాల్లో అలజడులు సృష్టించారన్నారు. రైతుల్లో నెలకొన్న అపోహలను నివృత్తి చేసి ముడా సంస్థ ద్వారా భూములు సేకరించి పోర్టు పనులకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతు లమీదుగా శంకుస్థాపన చేయించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్ ద్వారా పోర్టు కథను మళ్లీ మొదటికి తెచ్చారన్నారు. కమిషన్ల కోసం నవయుగను తప్పించి మేఘా వారితో నామ్ కే వాస్తే చందాన ఎన్నికల ముందు పనులు ప్రారంభించి చేతులు దులుపుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి కొల్లు రవీంద్ర మేఘా సంస్థతోనే పనులను వేగవంతం చేయించారన్నారు. కక్షపూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ పేర్ని నాని అని విమర్శించారు. చేయని నేరానికి నాడు కొల్లు రవీంద్రను హత్య కేసులో ఎ1గా చేర్చేందుకు పేర్ని నాని రెండు రోజులు ఎస్పీ ఆఫీస్ లో కూర్చుని మంతనాలు చేసింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. పేర్ని నాని కుమారుడు కిట్టు వాస్తవాలు తెలుసుకోకుండా వయసుకు మించిన విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్ కుమార్, నగర మాజీ కార్యదర్శి పిప్పళ్ళ వెంకన్న, బందరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదనరావు, తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ, కరెడ్ల సుశీల, హైమావతి, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



## చందర్లపాడు టీడీపీ మండల సమావేశం

**చందర్లపాడు, జూన్ 16, మేజర్ న్యూస్:** మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులతో సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు మేకల సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు,మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య,జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బొందల రామకృష్ణ,వివిధ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

## పెదపారుపూడి ఎంపీడీఓగా విమాదేవి



**పెదపారుపూడి జూన్ 16 మేజర్ న్యూస్ :** పెదపారుపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె. విమాదేవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మొవ్వ మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేసున్న విమాదేవి సాధారణ బదిలీలలో భాగంగా పెదపారుపూడికి బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇంచార్జి ఎంపిడిఓ గా ఉన్న నందివాడ ఎంపీడీఓ మల్లీశ్వరి నుండి ఆమె ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీపీ గోగం సురేష్ మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ తో సత్కరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విమాదేవికి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంగా శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బేగం, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్, టైపిస్ట్ ఏసుబాబు శుభాకాంక్షలు తెలిపారు.

# హిమాలయ బేబీకేర్ ‘జెంటిల్ యాజ్ డాడ్’ క్యాంపెయిన్ ప్రారంభం




**విజయవాడ, జూన్ 14, మేజర్ న్యూస్ :** భారతదేశంలో నెంబర్ వన్ డాక్టర్ ప్రిస్క్రైబ్ చేసే బేబీకేర్ బ్రాండ్ హిమాలయ బేబీకేర్ ఫాదర్స్ డే సందర్భంగా హృదయాన్ని హత్తుకునే వీడియో ఫిల్మ్ను విడుదల చేసింది. ప్రసిద్ధ కన్నడ పాట ‘ఐ లవ్ యూ అప్పా’ స్ఫూర్తిగా తీసుకుని రూపొందించిన ఈ ‘జెంటిల్ యాజ్ డాడ్’ క్యాంపెయిన్ తండ్రి, కూతురి మధ్య అనుబంధాన్ని ఎంతో భావోద్వేగంతో చెబుతుంది. పుట్టుక నుంచి పెళ్లి వరకు గల బంధం ఇందులో ఉంది. ప్రాంతీయ ప్రేక్షకులతో అనుబంధం ఏర్పడేలా ఈ పాటను హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, మరాఠీ, బెంగాలీ భాషలలోకి అనువదించారు. ఈ ఫిల్మ్ ఒక శక్తివంతమైన దృశ్యంతో మొదలవుతుంది. ఆరువై దశకంలో ఉన్న తండ్రి అద్దం ముందు రెడీ అవుతుండగా.. పెళ్లి కూతురు వేషధారణలో ఉన్న చిన్నపాప ‘అప్పా’ అంటూ పిలుస్తుంది. ఒక ఫోటో ఆల్బమ్ను అందిస్తుంది. ఆ ఆల్బమ్లోని పేజీలు తిరగేస్తుండగా తండ్రి దృష్టిలో కనిపించే అనేక భావోద్వేగాల ప్రయాణం ఆరంభం అవుతుంది. బేబీ మసాజ్ ఆయిల్, బేబీ సోప్, లోషన్తో పాపతో ఆడుకుంటూ చేసిన చిన్న చిన్న మధుర క్షణాలు హృదయాన్ని హత్తుకుంటుంది. ఈ క్షణాలు ‘ఐ లవ్ యూ అప్పా’ అనే మధుర గీతంతో కలిపారు. తండ్రిని కేవలం సంరక్షకుడిగా మాత్రమే కాకుండా, ఒక బలమైన ఆధారంగా కూడా ఇందులో చూపిస్తారు. పిల్లల జీవితంలో తండ్రి పాత్ర ఈ ప్రచారంలో హృదయాన్ని తాకుతుంది. ఈ కథనంలో హిమాలయ బేబీకేర్ ఉత్పత్తులు బేబీ మసాజ్ ఆయిల్, బేబీ సోప్, బేబీ లోషన్.. తండ్రి, పిల్లల మధ్య మధుర అనుభవాల్లో సహజంగానే మిళితమై ఉంటాయి. శాస్త్రీయతతో హెర్బల్ కేర్ను అందించే ఈ ఉత్పత్తులు తండ్రి పాత్రను మరింత అర్థవంతంగా చూపిస్తూ, ప్రేమ, పెంపకం, మార్గదర్శనం వంటి ప్రతి అంకంలో ఓ మౌన భాగస్వామిగా ఎంతో హృద్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా హిమాలయ వెల్నెస్ కంపెనీ బేబీకేర్ డైరెక్టర్ చక్రవర్తి ఎన్వీ మాట్లాడుతూ తండ్రి ఎప్పుడూ పిల్లల జీవితంలో మౌనమైన ఆధార స్తంభాలుగా ఉంటారన్నారు. ఎప్పుడూ పిల్లల వెనుక నిలబడి ప్రేమతో వారి ప్రపంచాన్ని నిర్మించే వారుగా ఉంటారని తెలిపారు. ఈ క్యాంపెయిన్తో తండ్రుల శక్తిని గౌరవించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ‘ఐ లవ్ యూ అప్పా’ పాట సాంస్కృతిక భావోద్వేగాన్ని కలిగి ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనుసంధానమయ్యే కథ ద్వారా ఒక రక్షకుడిగా, స్నేహితుడిగా, మార్గదర్శిగా ఉన్న ప్రతి తండ్రిని గౌరవించడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సోషియల్ వంగా సహస్థాపకుడు హిమన్షు అరోరా మాట్లాడుతూ ఈ ఫాదర్స్ డే సందర్భంగా మా ప్రచారం తండ్రులు, కూతుళ్ల మధ్య ఉన్న శాశ్వత బంధాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఓ తండ్రిగా ఈ అనుబంధం నాకు వ్యక్తిగతంగా ఎంతో విలువైనదన్నారు. కూతురు ఎంత వయసు వచ్చినా తన తండ్రికి ఎప్పటికీ చిన్నపాపే అన్నారు. భావాన్ని స్పష్టంగా చెప్పే సామర్థ్యం ఈ పాటలో ఉంది కాబట్టే దాన్ని జాగ్రత్తగా ఎన్నుకున్నామన్నారు. ఈ ప్రయాణాన్ని అందంగా చూపించే విధంగా ఈ ప్రచారాన్ని రూపొందించాలనుకున్నామని తెలిపారు. దేశ నలుమూలల చేరేలా ఈ పాటను ఆరు భాషల్లో రూపొందించామన్నారు. మృదువైన, సహజ సంరక్షణ విలువలతో ముందుండే పేరెంటింగ్ భాగస్వామిగా హిమాలయ బేబీకేర్తో భాగస్వామ్యం చేసుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ ప్రచారాన్ని యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ లలో #GentleAsDad అనే హ్యాష్ట్యాగ్తో ప్రారంభించనున్నారు. ప్రేక్షకులు తమ తండ్రులతో ఉన్న జ్ఞాపకాలను, మధుర క్షణాలను పంచుకోవడం కోసం ప్రోత్సహించనున్నారు. https://www.youtube.com/watch?vRCp89KdpZGSY

## విద్యార్థినికి ఆర్థిక భరోసా అందించిన ‘మైత్రి’



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక పెయింటర్స్ కాలనీకి చెందిన పేద కుటుంబం నాగ వెంకట లక్ష్మీ స్వరూప కుమార్తె చిరంజీవి వేద వర్షిని నిర్మలా ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాలలో 527/600 మార్కులు సాధించింది. తండ్రి లేని ఈ విద్యార్థినికి చదువు అంటే మక్కువ. తల్లి ఇండ్లలో పనులు చేసుకుంటూ చదివిస్తుండగా మైత్రి ఫౌండేషన్ గౌరవ సభ్యులు భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థలో డిప్యూటీ జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్న బి.ఎన్.ఆర్. గణేష్ సహృదయతతో ఆ పేద విద్యార్థినికి, సోమవారం 10,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని మైత్రి ఫౌండేషన్ ద్వారా అందించి పాప ఇంటర్మీడియట్ విద్యను చైతన్య కాలేజీలో కొనసాగించేందుకు చేయూత అందించారు. గణేష్ మానవత్వానికి ఫౌండేషన్ తరపున అధ్యక్షులు కేసాని వేణు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.గౌరవ అధ్యక్షులు ఏ ఆర్ కే వరప్రసాద్, కోశాధికారి కనకరాజు, మైత్రి సభ్యులు యద్దనపూడి వెంకట రమణ,ఎ.వి.రావు పాల్గొన్నారు.

## పిడుగు హరిప్రసాద్కు ఆహ్వాన పత్రిక అందించిన బండి రామకృష్ణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యులు శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ ను జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించిన జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అనంతరం పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులకు సేవ చేసే అవకాశాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్పించారని రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అన్నదాతకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వ సహకారంతో రైతుల సంక్షేమం కొరకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, జనసేన నాయకులు ముప్పారాజు, అడపా యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కౌన్సిల్ వైసీపీ ఫ్లోర్ లీడర్గా యాకుబ్ అలీ



**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ షేక్ యాకుబ్ అలీ (కట్టప్ప) ను నందిగామ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ నందిగామ మున్సిపల్ కౌన్సిల్ వైస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ గా నియమించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ యాకుబ్ అలీ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ మస్తాన్ ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలిసి యాకోబు ని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రధాన కార్యదర్శి గాడిపర్తి రామకృష్ణ, ఒర్సకొండ ఉపాధ్యక్షులు పాములపాటి రమేష్ తదితరులు

## జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం..



**నందిగామ, జూన్ 16, మేజర్ న్యూస్:** పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలపై వైయస్ జగన్ అంటే నమ్మకం...చంద్రబాబు అంటే మోసం” వైయస్ఆర్సీపీ పుస్తకం నందిగామ నియోజకవర్గ వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పట్టణ, నాలుగు మండలాల కన్వీనర్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధునాతన సౌకర్యాలతో మహిళా పోలీసుస్టేషన్ పునః నిర్మాణం







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** బందర్ రోడ్డులోని పాత కంట్రోల్ రూమ్ భవనంలో ఉన్న మహిళా పోలీసు స్టేషన్ కార్యాలయంను అత్యాదునిక సౌకర్యాలతో ఆధునీకరించి పునః నిర్మించారు. ఆధునీకరించిన మహిళా పోలీసు స్టేషన్ కార్యాలయాన్ని సోమవారం నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ప్రారంభించారు. ఆధునీకరించిన మహిళా పోలీసు స్టేషన్ లో అధికారుల రూమ్లు, కోర్ట్ రూమ్, రిసెప్షన్, మహిళా హెల్ప్ డెస్క్ కౌన్సిలింగ్ సెంటర్‌లతోపాటు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్, పిల్లల కోసం ప్రత్యేకంగా చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ప్లే రూమ్ లను మొదలగు విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి.లు కె.జి.వి.సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ఎ.డి.సి.పి.లు ఎ.వి.ఎల్ ప్రసన్న కుమార్, ఎ.సి.పి.లు లతా కుమారి, స్రవంతి రాయ్, పావన్ కుమార్, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు సిబ్బందితో మాట్లాడుతూ..... మహిళలు, బాలికల యొక్క రక్షణ కొరకు ప్రత్యేకంగా మహిళా పోలీసు స్టేషన్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడకు వచ్చే బాధితులు స్వాంతన పొందేలాగా సంవ్యవనం పాటిస్తూ మర్యాధగా మాట్లాడాలి, బాధితులకు మనం అండగా ఉన్నామనే భావన వచ్చేవిధంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలి. నేరస్తులకు కచ్చితంగా శిక్ష పదేవిధంగా చర్యలు తీసుకోవాలి. టెక్నాలజీ ఆధారంగా చేసుకుని సాక్ష్యాలను సేకరించి ముందుకు వెళుతూ ఎట్టి పరిస్థితులలో కూడా నేరస్థుడు నేరం చేయాలంటే భయపడేలాగ, నేరం జరిగితే కచ్చితంగా 24 గంటల లోపే నేరస్థుడిని గుర్తించేలాగా ఆపద సమయాలలో బాధితులకు (మహిళలు/బాలికలకు) మేము ఉన్నాం అనే భరోసా కల్పించే విధంగా విధులు నిర్వహించాలని తెలియజేశారు.

# ప్రశ్నించే గొంతులను అణిచివేయడం తప్ప ప్రజలకు చేసిన మేలేమి ?

### ఇచ్చిన హామీలను అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కూటమి

### పశ్చిమ వైసీపీ సమన్వయ కర్త వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ పశ్చిమ మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైకాపా మీడియా సెల్ రూపొందించిన పుస్తకాన్ని రాష్ట్ర వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సోమవారం పశ్చిమ నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక బ్రాహ్మణ వీధిలో గల తన కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గంలోని వైకాపా నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలిసే విధంగా ఈ పుస్తాకాన్ని రూపొందించడం జరిగిందని ఈ పుస్తకం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు జరిగాయి అనే అంశాన్ని ప్రజలకు వివరించే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు జగన్ అంటే నమ్మకం అనేటువంటి పరిపాలన సాగిందని నేడు చంద్రబాబు అంటే మోసం అనే పరిపాలన సాగుతుందని అన్నారు. చంద్రబాబు చేసే మోసాలను సాక్ష్యాలతో కూడినటువంటి వివరణ ప్రజలకు తెలియజేసేందుకు నడుం బిగించామన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతును అణిచివేయడం తప్ప ప్రజలకు చేసిన మేలేమి లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన ప్రతిఒక్కరిని అణిచివేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వము చేసిందన్నారు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఈ ఏడాది కాలంలో ఆరోగ్యశ్రీ, రైతుభరోసా, విద్యాదీవెన వంటి ప్రజా సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారన్నారు. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి అప్పు చేసి ఏమి సాధించారని ప్రశ్నించారు. ఒక్క సంక్షేమ పథకమైన అమలు చేసారా అన్నారు. జగన్ హయాంలో కుల మాత ప్రాంత కారతమ్యం లేకుండా సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. నేటి ప్రభుత్వంలో ప్రజలను పట్టించుకుండేటువంటి నాయకులే లేరన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సూన్యమన్నారు. పశ్చిమలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, ప్రజలను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. నా హయాంలో చేసిన అభివృద్ధి తప్ప ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారమే లేదన్నారు. నాడు నేను చేసిన శంకుస్థాపనలను నేడు కూటమి నేతలు ప్రారంభిస్తూ శునకానందం పొందుతున్నారన్నారు. కూటమి పాలను అణిచివేసే విధంగా ప్రజలతో కలిసి రానున్న రోజులలో పోరాటం చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న విధ్వంసాలను ప్రజలకు తెలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికన్నా కూటమి ప్రభుత్వం దిగి వచ్చి సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేసారు. చంద్రబాబు హయాంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుంది తప్ప ప్రజ సంక్షేమ పాలన నడవదన్నారు. అరెస్టులతో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ఆపలేరని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ కార్పొరేటర్లు బండి పుణ్యశీల, మండెపూడి ఛటర్జీ, యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఇర్ఫాన్, పడిగిపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటిరెడ్డి, గోదావరి గంగ, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, హయత్, దుర్గ గుడి మాజి చైర్మన్ కర్నాటి రాంబాబు, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజి చైర్మన్ గౌస్ మొహిద్దీన్, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్, బొందిలి నరేంద్ర సింగ్, వైసిపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ కన్వీనర్‌గా గడ్డిపాటి సుధీర్ బాబు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సమాజ సేవకుడు, సుదీర్ఘకాలంగా పత్రికా రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న ప్రముఖ పాత్రికేయుడు, విలువలతో కూడిన జర్నలిజానికి జీవం పోస్తున్న దివిసీమ కు చెందిన గడ్డిపాటి సుధీర్ బాబు ను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) కృష్ణాజిల్లా కన్వీనర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు గడ్డిపాటి సుధీర్ బాబు సోమవరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా పత్రికా రంగంలో విశిష్ట సేవలందిస్తూ నిరంతరం ప్రజాహితంకై పాటుపడుతున్న గడ్డిపాటి ఎన్నిక పట్ల జర్నలిస్టు సంఘంలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పింది.”పెన్” యూనియన్ సంఘటితానికి, సంక్షేమానికి, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు శక్తిమేరకు కృషి చేస్తాను,” అని ఈ సందర్భంగా గడ్డిపాటి స్పష్టం చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బడే ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. తనతో పాటు బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సింహాద్రి కృష్ణ ప్రసాద్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా గరికిపాటి వెంకట సాంబశివరావు ( శివ) సంయుక్త కార్యదర్శిగా లేబాక నాగేశ్వరరావులకు గడ్డిపాటి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బద్దం సుమలత,కోట సుబ్బారావు, బి.ఆర్.డి ప్రసాద్, జొన్న రవిశంకర్, అన్నం శివరామకృష్ణ తదితరులు నూతనంగా ఎన్నికైన నేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



## డిపి తండా ప్రైమరీ ఉన్నత తరగతుల తరలింపు తగదు

**జగ్గయ్యపేట, జూన్ 16, మేజర్ న్యూస్ :** మండలంలోని ధర్మవరప్పాడు తండాలో ఎక్కువగా సుగాలీలు నివసిస్తూ ఉంటారు.వీరు పోడు భూములను చేసుకుంటూ సమీపంలో ఉన్నటువంటి ఫ్యాక్టరీల్లో కూలి నాలికి వెళ్తూ ఉంటారు.ఎందరో దాతలు, ప్రభుత్వ సహాయంతో అక్కడ 6,7, 8 ఉన్నత తరగతులకు కూడా గదులు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులనుఏర్పాటు చేసే విద్యా బోధన చేస్తున్నారు.. కాలగమనంలో ఇటీవల ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంలో ఈ పాఠశాలలో ఉన్నటువంటి 6,7,8 తరగతులను సమీపంలో ఉన్నటువంటి జయంతిపురంలో విలీనం చేయడం జరిగినది. కాని రెక్కాడితే గానిడొక్కాడని ఈ సుగాలీల పిల్లలు అంత దూరం వెళ్లి చదువుకోవడం కష్టం. ఇప్పుడిప్పుడే చదువుకుని ఉన్నత స్థానాలు ఎదుగుతున్న సగాలీల పిల్లలు ఇలా మార్చటం వలన చదువుకు దూరం అయిపోయి మరి పూర్వకాలం లాగనే అరణ్యాల్లోనే ఉండాల్సి వస్తుంది. ఈ సమస్యను తీర్చాలని సోమవారం మండల పరిషత్ అధికారి జి.నవీన్ కుమార్‌కు పాఠశాలలోనే 6, 7, 8 తరగతులను తరలించవద్దని విద్యార్థులతో సహా తల్లిదండ్రులు ఆయనకు అర్జీని అందజేశారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి తెలిపారు.

## వికసిత భారత్ సంకల్ప సభ ఘనవిజయం



**విజయవాడ మేజర్ న్యూస్ :** కేదారేశ్వరపేట మండలంలో భారతీయ మండల అధ్యక్షులు మాగులూరి లావిన్ బాబు ఆధ్వర్యంలో జనతా పార్టీ విజయో త్సాహంతో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభ ఘనవిజయం సాధించింది. ఈ కార్యక్రమం మోడీ 11 సంవత్సరాల ప్రజాసేవను గౌరవి స్తూ నిర్వహించబడింది. ఈ సభకు ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు, బీజేపీ కోశాధికారి అవార్ బుల్లబ్బాయి విచ్చేసి సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కన్వీనర్ నాయకురాలు చోరగుడి శివ లలిత పటిష్ఠంగా కార్యక్రమాన్ని నడిపించారు. జిల్లా కో కన్వీనర్, జిల్లా కార్యదర్శి నున్న కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గాయత్రి, ప్రధాన కార్యదర్శి వైదుర్స్ మోహన్ విజయ్, హైకోర్టు లాయర్ జ్యోతుల విజయ్, డివిడి ప్రసాద్, జిల్లా కో కన్వీనర్ పైలా సురేష్ తదితర బూత్, మండల నాయకులు, కార్యకర్తలు సభకు హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ జనతా పార్టీ సుదీర్ఘ సేవా పరంపర, వికాస మార్గాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముమ్మరంగా కృషి చేస్తోంది.



18 వసంతాల ‘సూర్య’ మహాయజ్ఞంలో ‘సూర్య’ అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన ‘సూర్య’ కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999